క్లుప్తంగా

పింఛన్ సొమ్ము మంజూరు

పాణ్యం: జూలైకు సంబంధించి పింఛన్ దారులకు పంపిణీ చేసేందుకు పింఛన్ సొమ్ము మంజూరైందని ఎంపీడీఓ భాగ్యలక్ష్మి గురువారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ జూలై నెలకు గాను మండలంలో వివిధ రకాల పింఛన్ దారులు మొత్తం కలిపి 6,397 మంది ఉండగా, వీరికి రూ.4,28,26,500 మంజూరైందన్నారు. సచివాలయాల ద్వారా ప్రతి పింఛన్ దారుడికి నగదు అందజేస్తామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన రెండు రోజుల గడువులోగా పూర్తి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు.

నోట్ పుస్తకాల పంపిణీ



పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

పాణ్యం: మండల పరిధిలోని గగ్గటూరు ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు గురువారం పుస్తకాలు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన సద్దల శివమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, అట్టలు, కలర్ పెన్సిళ్లు, ఇతర సామగ్రిని అందించారు. విద్యార్థులు మంచి లక్ష్యాలతో ముందుకు వెళ్లాలని సూచించారు.

30న ఉచిత మెగా వైద్య శిబిరం

కల్లూరు : ఈ నెల 30న ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు శ్రీ శ్రీ అవధూత రామిరెడ్డి తాత సంస్థాన్ అధ్యక్షుడు దాసరి రామచంద్రరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమాజ హిత సేవా కార్యక్రమంలో భాగంగా శ్రీశ్రీ అవధూత రామిరెడ్డి (కల్లూరు), రామ సన్నిధానం (హైదరాబాద్) వారి ఆధ్వర్యంలో ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అనుభవం గల వైద్యులచే అన్ని వ్యాధులకు చికిత్స చేసి, అవసరమైన మందులు ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. కావున ఉచిత వైద్య శిబిరమును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలోని వివిధ ప్రాంతాల్లో కొత్త విద్యుత్ లైన్‌లు వేయడం, ఉన్న లైన్‌లు, సబ్ స్టేషన్‌ల మెయిన్‌టెనెన్స్ పనులు నిర్వహిస్తుండటం వల్ల శుక్రవారం ఉదయం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏడీఈ నాగప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వీకర్ సెక్షన్, బి.రోడ్ సెక్షన్ కాలనీలలోని స్కందాన్షి వెంచర్, బోసిరెడ్డి కాలనీ, బీసీ కాలనీ, లెప్రసీ కాలనీ, వాసవీ హోటల్ ఏరియాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

6 నుంచి వారాహీ నవరాత్రి మహోత్సవాలు

కర్నూలు కల్చరల్: నగర శివారులోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో మహా గౌరీ అమ్మవారికి జూలై 6 నుంచి 16వ తేదీ వరకు ఆషాడ మాస వారాహీ నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ తొమ్మిది రోజుల పాటు ప్రతి రోజు ఉదయం 9.30 నుంచి రాత్రి 6.30 గంటల వరకు ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. అనంతరం వారాహీ సహస్రనామార్చన ఉంటుందన్నారు.

- ఓల్డ్‌సిటీలోని లలితా పీఠం లలితా సుందరేశ్వర స్వామి ఆలయంలో వచ్చేనెల 6 నుంచి 14వ తేదీ వరకు ఆషాడ మాసం వారాహీ నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు శ్రీ లలితా సంఘం అధ్యక్షులు తెల్లాకుల జ్ఞానేశ్వరమ్మ తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం గణపతి పూజ, గోపూజ, సర్వదేవతా పూజ, వారాహి అమ్మవారి షోడశ ఉపచార పూజ, దర్బార్ సేవ, ఊంజల్ సేవ, తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

జింకల బెడద నుంచి పంటలు కాపాడాలి

కర్నూలు(సెంట్రల్): జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో జింకల బెడద నుంచి పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ ప్రభుత్వాన్ని గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆలూరు, ఆస్పరి, తుగ్గలి, పత్తికొండ, ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల, గూడూరు, కల్లూరు, ఓర్వకల్లు మండలాల్లో జింకల మందలు పొలాలపై పడి నాశనం చేస్తుండడంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందన్నారు. 2014లో జింకల బెడద నుంచి రక్షణ కోసం పార్కును కట్టిస్తానన్న చంద్రబాబునాయుడు ఇప్పుడైనా ఆ సమస్యపై దృష్టి సారించాలని కోరారు.

మరుగుదొడ్డిని వినియోగంలోకి తేవాలి

కర్నూలు(సెంట్రల్): నగరంలోని బండిమెట్టలో మూతేసిన సామూహిక మరుగుదొడ్డిని వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకోవాలని సీపీఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం లాక్ చేసిన మరుగుదొడ్డిని సీపీఎం బృందం పరిశీలించింది. ఎప్పుడో చేసే మరమ్మతుల కోసం వినియోగంలో ఉన్న దానిని లాక్ చేయడంతో మహిళలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు.

నాణ్యమైన నారుతో మేలైన దిగుబడి

- నారుమడిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి
- గడివేముల మండలంలో 10 వేల ఎకరాల్లో వరి సాగు
- చలి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో జింకు లోపించే అవకాశం
- నారు నాటేముందు కొనలు విరచాలి



బూజునూరు గ్రామ సమీపంలో వేసిన వరి నారుమడి (ఫైల్)

గడివేముల: రైతులు జాగ్రత్తలు పాటించి నారుమళ్లను పోసుకుంటే నాణ్యమైన నారు, దిగుబడిని పొందవచ్చని, నారుమడి యాజమాన్య పద్ధతులను పాటించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఈ ఏడాది మండలంలో దాదాపు 10 వేల ఎకరాల దాకా వరి సాగు చేసే అవకాశం ఉంది.

విత్తన మోతాదు ఇలా..
నాటే పద్ధతిని బట్టి వెదజల్లడానికి 20 నుంచి 25 కిలోలు విత్తనాలను వినియోగించవచ్చు. సాధారణ భూముల్లో 24 నుంచి 30 కిలోలను వాడవచ్చు. సహజంగా వెదజల్లడానికి 16 నుంచి 30 కిలోలు సరిపోతాయి. విత్తడానికి (వర్షాధారపు వరి)కి సంబంధించి 30 నుంచి 36కిలోల అవసరం ఉంటుంది.

విత్తన శుద్ధి ఇలా..
కిలో విత్తనానికి 2.5 గ్రాముల కార్బండిజమ్ కలిపి 24 గంటల తర్వాత నారుమడిలో చల్లుకోవాలి. దంప నారుమళ్లకైతే లీటరు నీటికి ఒక గ్రాము కార్బండిజమ్ కలపాలి. ఆ ద్రావణంలో విత్తనాలను 24 గంటలు నాన బెట్టాలి. మరో 24 గంటల పాటు మండీకట్టి మొలకలను దంప నారుమడిలో చల్లు కోవాలి. కిలో విత్తనాలు నానబెట్టడానికి లీటరు నీరు సరిపోతుంది. పది లీటర్ల నీటికి 1.5 కిలోల ఉప్పు కలపగా వచ్చిన ద్రావణంలో ఎంపిక చేసుకున్న విత్తనాన్ని పోసి పైకి తేలిన విత్తనాలను తొలగించాలి. ఉప్పు నీటిలో మునిగిన గట్టి విత్తనాలను నారు పోయడానికి వాడుకోవాలి. మడిలో చల్లే ముందు 24 గంటల పాటు మంచినీటిలో విత్తనాలను నానబెట్టాలి. విత్తనాల ద్వారా సంక్రమించే తెగుళ్ల నివారణ కోసం కిలో విత్తనానికి 3 గ్రాముల థైరమ్ లేదా కాప్టాన్ మందును కలిపి విత్తనశుద్ధి చేయాలి. నారుమడిలో చల్లే విత్తనాలు ముందు. మొలకెత్తిన విత్తనాన్ని 0.2శాతం క్లోరిపైరీపాస్ ద్రావణంలో నానబెట్టి చల్లుకోవాలి. దీని వల్ల నారు మడిలో ఆకు తినే పురుగులు, ఉల్లికోడు, మొవ్వపురుగు ఆశించకుండా ఉంటాయి.

నారుమడి తయారీ ఇలా..
దమ్ము చేసిన నేలలో 10మీటర్ల పొడవు, ఒక మీటరు వెడల్పుతో నారుమడిని చేసుకోవాలి. నారుమడిలోని నీరు, పోషకాలు బయటకు పోకుండా గట్లు వేసుకోవాలి. గట్లు సమంగా, గట్టిగా పోయాలి. మడిలో చెత్తాచెదారం లేకుండా జాగ్రత్త పడాలి. నారుమడి బురద పదునులో ఉండాలి. నారుమడులు ఎత్తుగా ఉండేలా జాగ్రత్త వహించాలి. రెండు మడుల మధ్యలో 20 సెంటీమీటర్ల వెడల్పులో కాలువ తీయాలి. కాలువలోని మట్టిని తీసి మడిలో వేసే నారుమడిని ఎత్తుగా చేసుకోవాలి. నారు మడి మొత్తం చదునుగా ఉండాలి. నారుమడిని 10 నుంచి 12 రోజుల ముందే దమ్ము చేసి చదును చేసు కోవాలి. నీరు పెట్టడానికి, తీయడానికి వీలుగా కాలువలను ఏర్పాటు చేసుకోవాలి. మొలక కట్టినవిత్తనాన్ని సెంటుకు 5కిలోల చొప్పున చల్లుకోవాలి. నారు పూర్తిగా పురి విచ్చుకునే వరకు ఆరు తడులు ఇచ్చి.. తర్వాత పల్చగా నీరు నిల్వ కట్టాలి. జింకు లోపాన్ని గమనించి 2గ్రాముల జింకు సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి. చలి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లోనే జింకు లోప లక్షణాలు ఎక్కువగా కనబడతాయి. తల్లి పురుగు గుడ్లను కొసల మీద పెడుతుంది. నారు నాటేటప్పుడు కొనలు విరిచి నాటాలి. దీంతో గుడ్లను నిర్మూలించవచ్చు.

ఎరువుల సస్యరక్షణ ఇలా..
విత్తిన 10 రోజులకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు సెంటు నారుమడికి 160 గ్రాముల చొప్పున వేయాలి. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీలీటర్లు లేదా క్లోరిపైరిఫాస్ 2.0మిల్లీ లీటర్లను లీటరు నీటికి కలిపి విత్తనాలపై 10 నుంచి 17రోజుల వరకు పిచికారీ చేయాలి. లేదా నారు తీయడానికి వారం రోజుల ముందు సెంటు నారుమడికి 160 గ్రాముల కార్బోఫ్యూరాన్ గుళికలు తక్కువ నీటిలో వేయాలి.

యాజమాన్యం ఇలా..
నారుమడులు పోయాలనుకున్న భూమిలో వేసవి దుక్కులకు ముందుగానే పశువుల ఎరువును వేయాలి. నారుమడులు పోయడానికి పొలంలో 10వ భాగాన్ని ఎంపిక చేసుకోవాలి. ఎంపిక చేసుకున్న పొలానికి నీరు పెట్టి బాగా కలియదున్నాలి. తర్వాత మట్టి గడ్డలన్నీ మెత్తగా అయ్యేలా బాగా దమ్ము చేయాలి. మొక్కలు లేకుండా జాగ్రత్తపడాలి. 5 సెంట్ల నారుమడికి 2కిలోల నత్రజనిని ఒక కిలో విత్తనం చల్లే ముందు, మరో కిలో విత్తిన 12 నుంచి 14 రోజులకు, ఒక కిలో భాస్వరం, ఒక కిలో పొటాష్ ఎరువులను దుక్కిలో వేయాలి. చలి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో భాస్వరం రెట్టింపు చేసుకోవచ్చని వివరించారు.

ప్రభుత్వాసుపత్రిలో ల్యాప్‌టాప్ చోరీ

కర్నూలు: స్థానిక ప్రభుత్వాసుపత్రి క్యాజువాలిటీలో రాత్రి విధుల్లో ఉన్న వైద్య విద్యార్థి పెంజురి అనంతనాగ్ ల్యాప్‌టాప్ చోరీకి గురైంది. సత్యసాయి జిల్లా సుందరయ్యనగర్‌కు చెందిన అనంతనాగ్ కర్నూలు మెడికల్ కాలేజీలో వైద్య విద్య(పీజీ) ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 25న ప్రభుత్వాసుపత్రి క్యాజువాలిటీలో ఉన్న టేబుల్‌పై తన ల్యాప్‌టాప్‌ను ఉంచి విధులు నిర్వహిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు తస్కరించారు. తెల్లవారుజామున (26వ తేదీ) టేబుల్‌పై ఉంచిన ల్యాప్‌టాప్ కనిపించలేదు. డెల్ కంపెనీకి చెందిన ల్యాప్‌టాప్ చోరీకి గురయ్యిందని, దాని విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందని అనంతనాగ్ గురువారం మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మురళీధర్‌రెడ్డి తెలిపారు.

ఆటో చోరీ..
ప్రభుత్వాసుపత్రిలో ఆటో చోరీకి గురైంది. గూడూరు మండలం గుడిపాడు గ్రామానికి చెందిన మలిగెపోగు రాజు బుధవారం ఉదయం 10 గంటల సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి ఏపీ21 టీవీ 0495 నంబర్ ఆటోలో ఆసుపత్రికి వచ్చారు. ఓ వార్డు వద్ద ఆటోను పార్క్ చేసి వార్డులోకి వెళ్లి తిరిగి వచ్చేసరికి గుర్తు తెలియని వ్యక్తులు ఆటోను తస్కరించారు. తాను ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నానని, చోరీకి గురైన తన ఆటో సమాచారం తెలిస్తే 9441620752, 8688170293 నంబర్లకు ఫోన్ చేసి సహకరించాలని కోరుతున్నాడు.

చోరీలు జరుగుతుంటే ఏం చేస్తున్నారు

- సెక్యూరిటీపై సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి ఆగ్రహం



సెక్యూరిటీ అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో తరచూ చోరీలు జరుతుంటే సెక్యూరిటీ సిబ్బంది ఏం చేస్తున్నారని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆసుపత్రిలో గ్రాండ్ రౌండ్స్ నిర్వహించారు. న్యూరోసర్జరీ, కార్డియాలజీ, యురాలజీ, ఆర్థో ఓటీ, ఈఎన్‌టీ, న్యూ క్యాజువాలిటీ, ఓల్డ్ బ్లడ్‌బ్యాంక్ విభాగాలను సందర్శించారు. న్యూరోసర్జరీ విభాగంలో ఉన్న సిబ్బందితో సమస్యలపై చర్చించారు. అక్కడి ఐసీయూలో నాలుగు ఆక్సిజన్ బోర్డులు, నాలుగు ఎలక్ట్రికల్ సాకెట్లు, ఫ్లోర్‌టైల్స్ గురించి సిబ్బంది వివరించారు. అనంతరం ఏపీఎంఎస్ఐడీసీ ఇంజినీర్లతో మాట్లాడి టైల్స్‌కు సంబంధించి మరమ్మతులు యుద్ధప్రాతిపదికన చేయాలని సూపరింటెండెంట్ ఆదేశించారు. కార్డియాలజీ ఐసీసీయూలో సింక్, పైప్‌లైన్ సమస్యలను అక్కడి వైద్యులు, సిబ్బంది ప్రస్తావించారు. ఈ సమస్యలను పూర్తి చేయాలని ప్లంబర్‌ను డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. యురాలజీ మహిళల విభాగంలో గదుల తాళాలను నర్సింగ్ సిబ్బంది అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఆర్థో మహిళల వార్డులో రూఫ్ వాటర్ లీకేజీ, ప్రత్యేక మ్యాన్‌హోల్ పనులను పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు తెలిపారు. ఈఎన్‌టీ వార్డులో చక్రాల కుర్చీలు, ట్రాలీలు అవసరం ఉందని సిబ్బంది చెప్పడంతో సానుకూలంగా స్పందించారు. సర్జికల్, ఆర్థో వార్డులలో పాత సామగ్రిని విక్రయించాలని ఆదేశించారు. న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్ వన్‌లో రోగులు కూర్చునేందుకు కుర్చీలు ఏర్పాటు చేయాలన్నారు. కొత్త క్యాజువాలిటీ విభాగంలో లైట్లు, ఫ్యాన్‌ల ఏర్పాటు, మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలని ఎలక్ట్రీషియన్‌ను ఆదేశించారు. ఆసుపత్రిలోని ఎలక్ట్రీషియన్ బృందం ప్రతిరోజూ రెండు విభాగాలకు సంబంధించిన లైట్లు, ఫ్యాన్లకు మరమ్మతులను నర్సింగ్ సూపరింటెండెంట్ ద్వారా లైట్‌లను ఏర్పాటు చేసి నివేదికను ఇవ్వాలని నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రీబాయికి ఆదేశించారు. న్యూ ఏఎంసీ విభాగానికి సంబంధించిన మరమ్మతులపై ఆరా తీశారు. ఆయన వెంట సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఏఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటివ్ డాక్టర్ శివబాల నాగాంజన్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ సమస్య తలెత్తనివ్వొద్దు

ఆస్పత్రిలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి సూచించారు. తన చాంబర్‌లో ఏపీఎంఎస్ఐడీసీ ఇంజినీర్లతో విద్యుత్ సమస్యలపై ఆయన సమీక్ష నిర్వహించారు. న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్ ట్రాన్స్‌ఫార్మర్లు త్వరలో అందుబాటులోకి రానున్నాయన్నారు. ఎలక్ట్రికల్ సిబ్బంది కొరత వల్ల మరికొందరిని కాంట్రాక్టు పద్ధతిలో తీసుకోవాలని, ఇందుకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఉద్యోగులను ఆదేశించారు. ఆసుపత్రిలో విద్యుత్ వల్ల ఏదైనా సాంకేతిక సమస్య ఎదురైతే తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సమావేశంలో ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ శివకుమార్, ఏపీఎస్‌పీడీసీఎల్ డీఈ జయరామిరెడ్డి, ఏఈ జాన్ తదితరులు పాల్గొన్నారు.

నర్సుల సమస్యలు పరిష్కరించాలని వినతి



ఆరోగ్యశాఖ మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నర్సుల సంఘం పూర్వ రాష్ట్ర అధ్యక్షురాలు మంజులదేవి

కర్నూలు(హాస్పిటల్): రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న నర్సుల సమస్యలు పరిష్కరించాలని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను ప్రభుత్వ నర్సుల సంఘం పూర్వ రాష్ట్ర అధ్యక్షురాలు డి. మంజులాదేవి కోరారు. అమరావతిలోని సచివాలయంలో గురువారం ఆయనను కలిశారు. రాత పరీక్ష ద్వారా రెగ్యులర్ రిక్రూట్‌మెంట్ చేయాలని, అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలని, పీహెచ్‌సీల్లో నర్సులకు సపోర్టింగ్ స్టాఫ్‌ను నియమించాలని, నర్సింగ్ సిబ్బందికి అన్ని వ్యాధులకు ఈహెచ్ఎస్ అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయాలని, రాష్ట్రంలో నర్సింగ్ డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలని, నర్సులకు ఐదు రోజుల ప్రత్యేక సెలవు జీఓ ఇవ్వాలని తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మంత్రికి అందజేశారు.

నవజాత శిశువుకు అరుదైన శస్త్రచికిత్స

- ఆరోగ్యశ్రీ పథకంలో ఉచితంగా వైద్యం



బాబు తల్లిదండ్రులతో డాక్టర్ అమరనాథ్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): నవజాత శిశువుకు అరుదైన శస్త్రచికిత్స చేసి ఆయువు పోశారు కర్నూలు వైద్యులు. గురువారం స్థానిక నంద్యాల రోడ్డులోని శ్రీ సాయిమేఘ హాస్పిటల్‌లో శస్త్రచికిత్స వివరాలను చిన్నపిల్లల వైద్యులు అమరనాథ్‌రెడ్డి వివరించారు. ఆయన మాటల్లోనే.. 'తుగ్గలి మండలం జి.ఎర్రగుడి గ్రామానికి చెందిన ఆనంద్, మౌనిక దంపతులకు ఈనెల 9న సిజేరియన్ ద్వారా మగ బిడ్డ జన్మించాడు. బాబు పాలు తాగకపోవడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిగా ఉందని గుర్తించి మా ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఆరోగ్యశ్రీ కింద ఆస్పత్రిలో చేర్చుకుని బాబుకు అన్ని పరీక్షలు నిర్వహించి ఆహార నాళం సరిగా అభివృద్ధి చెందలేదని నిర్ధారించి చిన్నపిల్లల శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ కృష్ణనాయక్, మత్తుమందు వైద్యులుతో కలిసి నాలుగు గంటల పాటు శ్రమించి ఆపరేషన్ చేసి, శ్వాసనాళం, ఆహారనాళం మధ్య ఉన్న అడ్డంకిని తొలగించాం. ఆపరేషన్ విజయవంతమై బాబు కోలుకోవడంతో వారం రోజుల తర్వాత డిశ్చార్జ్ చేశాం' అని డాక్టర్ అమరనాథ్‌రెడ్డి తెలిపారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకరప్ప

కర్నూలు(సెంట్రల్): భవన నిర్మాన కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ఎన్‌డీఏ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సంక్షేమ బోర్డు ద్వారా గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. భవననిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె.సుధాకరప్ప మాట్లాడుతూ నూతన ఇసుక పాలసీని ప్రవేశపెట్టాలన్నారు. సమావేశంలో నాయకులు ఆర్.నరసింహులు, అబ్దుల్లా, ఏసు, నాగరాజు, ఈశ్వరయ్య, శ్రీనివాసులు, రహిమాన్, శీను పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులతోనే పింఛన్ల పంపిణీ



సచివాలయ సిబ్బందితో సమీక్షిస్తున్న ఎంపీడీఓ మల్లీశ్వరి

ఓర్వకల్లు : సామాజిక పింఛన్లను సచివాలయ ఉద్యోగుల ద్వారానే పంపిణీ చేస్తామని ఎంపీడీఓ మల్లీశ్వరి తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పింఛన్ల పంపిణీపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. గతంలో వలంటీర్ల ద్వారా జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఇక మీదట సచివాలయ ఉద్యోగుల ద్వారానే చేపట్టాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. జూలై నెలలో అర్హత గల లబ్ధిదారులకు రూ.7వేలు పింఛన్ చెల్లిస్తామన్నారు. మండలంలో అన్ని రకాల కేటగిరీలకు సంబంధించి మొత్తం 7,805 మంది పింఛన్‌దారులు వుండగా, ఒక్కొక్కరికి రూ.7వేల చొప్పున మొత్తం రూ.5,23,2600లు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. జూలై 1వ తేదీన ఉదయం 6 గంటలకు సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాలని సూచించారు. పింఛన్‌దారులు ఎవ్వరుకూడా సచివాలయాల వద్దకు వెళ్లాల్సిన అవరంలేదని స్పష్టం చేశారు.

విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్ చేయండి

సి.బెళగల్: విద్యార్థుల వివరాలను ఎప్పటికి అప్పుడు ఆన్‌లైన్ చేయాలని ఎంఈఓ జ్యోతి హెచ్‌ఎంలకు సూచించారు. గురువారం ఆమె స్పెషల్ స్కూల్‌ను తనిఖీ చేశారు. విద్యార్థుల ప్రవేశాల వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల వివరాలు యూడైస్‌లో ఆన్‌లైన్ చేయకుండా నిర్లక్ష్యం చేసే హెచ్ఎంలు, టీచర్లపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు.


టీఏ కార్యవర్గం ఎన్నిక



మాట్లాడుతున్న మధుశేఖర్

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా నీటి యాజమాన్య సంస్థ కర్నూలు డివిజన్ యూనిట్ సాంకేతిక సహాయకుల(టీఏ) సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఏర్పాటైంది. గురువారం జిల్లా పరిషత్ ప్రాంగణంలోని మండల పరిషత్ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్ అసోసియేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా కే.మధుశేఖర్, ఉపాధ్యక్షులుగా బివిజి వెంకటేష్, కార్యదర్శిగా లక్ష్మణ్‌నాయక్, సంయుక్త కార్యదర్శిగా చెన్న కేవవులు, కోశాధికారిగా మురళీమోహన్, గౌరవ సలహాదారులుగా నాగేశ్వరరెడ్డి, గౌస్ మోదిన్, సూర్యనారాయణరెడ్డి, మెంబర్లుగా కిశోర్, రామ్‌శంకర్, మల్లేశ్వరి, అరుణకుమారీ, శిషిరెడ్డి, పురుషోత్తం, రవి, రాజు, రఘునాథ్, శ్యామల, చాంద్ బాషా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మధుశేఖర్ మాట్లాడుతూ సాంకేతిక సహాయకులు ఎదుర్కొంటున్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు యోగాజ్ఞ ఎంపిక



విద్యార్థినిని అభినందిస్తున్న పాఠశాల కోఆర్డినేటర్ గౌతమి

కర్నూలు (టౌన్): జులై చివరి వారంలో విజయవాడలో నిర్వహించనున్న జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు తమ పాఠశాల విద్యార్థి యోగాజ్ఞను ఎంపిక య్యాడని ఆథెనా స్కూల్ కోఆర్డినేటర్ గౌతమి తెలిపారు. గురువారం విద్యార్థినిని ఆమె అభినందించారు. ఈ సందర్భంగా గౌతమి మాట్లాడుతూ ఈనెల 22 నుంచి 24 వరకు విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఆర్చరీ అండర్-10 పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపిక కావడం సంతోషకరమన్నారు.

తుంగభద్రకు తగ్గుతున్న ఇన్‌ఫ్లో

- 5 టీఎంసీలకు పడిపోయిన నీటి నిల్వ
- ఎగువ భాగంలో నిరాశాజనకంగా వర్షాలు

హొళగుంద: ఆంధ్రా, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి రిజర్వాయర్, జిల్లా పశ్చిమ ప్రాంత ప్రజలకు వరప్రధాయిని తుంగభద్ర డ్యాంలో నీరు అడుగంటింది. కొద్ది రోజుల క్రితం ఇన్‌ఫ్లో కాస్త పెరిగి నీటి నిల్వ 6 టీఎంసీలు దాటింది. ఈ స్థితిలో ఎగువ భాగంలో వర్షాలు నిరాశజనకంగా ఉండడంతో నీటి నిల్వ 5 టీఎంసీలకు పడిపోయింది. దీంతో జలాశయంలో ఆశించిన స్థాయిలో నీరు లేక కళ తప్పింది. జలాశయం పూర్తి సామర్థ్యం 1633 అడుగులతో 105.788 టీఎంసీలుండగా గురువారం 1581.25 అడుగులతో 5.110 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో 582, అవుట్‌ఫ్లో 751 క్యూసెక్కులుంది. కర్ణాటకతో పాటు ఆంధ్రాకు సంబంధించి కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలకు సాగు, తాగునీరును అందిస్తున్న టీబీ డ్యాం గత రెండేళ్లుగా అన్నదాతలను నిరాశపరుస్తోంది. తుంగభద్ర జలాశయ పైభాగంలోని ఆగుంబే, వరనాడు, శివమొగ్గ, తీర్థనహళ్లి, శృంగేరి తదితర ఉత్తర కర్ణాటక ప్రాంతాల్లో వర్షాలు తగ్గడంతో ఎగువ నుంచి వరద లేకపోవడంతో తుంగభద్ర జలాశయం నీరు లేక బోసిపోతోంది. అయితే ఆగస్టు వరకు వర్షాలు కురిసే అవకాశాలుండడంతో రైతులు డ్యాం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు.

పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహం



ఆలూరు నర్సరీలో పెంచుతున్న నేరేడు చెట్లను పరిశీలిస్తున్న డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి

ఆలూరు రూరల్/దేవనకొండ: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా హార్టికల్చర్ కింద పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలని డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి సూచించారు. ఆయన గురువారం ఆలూరు ఉపాధి హామీ క్లస్టర్ పరిధిలోని ఏపీఓలు, టీఏలు, ఈసీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పండ్ల తోటలు సాగు చేసే రైతులకు ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద 16 రకాల మొక్కలను వంద శాతం ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. పండ్ల తోటల అభివృద్ధితో పాటు పచ్చదనం పెంపునకు ఉపాధిహామీ యంత్రాంగం కృషి చేయాలన్నారు. ఈ ఏడాది ఆలూరు క్లస్టర్ పరిధిలోని 5 మండలాల్లో 1,720 ఎకరాల్లో పండ్ల తోటల సాగు చేపట్టేలా లక్ష్యం నిర్దేశించామన్నారు. ఇప్పటివరకు 1,230 ఎకరాల్లో సాగు లక్ష్యం పూర్తి చేసినట్లు చెప్పారు. ఉపాధి హామీ జాబ్ కార్డుతో పాటు ఐదెకరాల్లోపు పొలం కలిగిన ఎస్సీ, ఎస్టీ, చిన్నకారు రైతులను అర్హులుగా పేర్కొన్నారు. గులాబీ, మల్లెతో సహా మామిడి, బత్తాయి, నేరేడు, జామ, సీతాఫలం, మునగ, సపోట, కొబ్బరి, దానిమ్మ, చింత వంటి తోటలు అభివృద్ధి చేసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆలూరు నర్సరీలో అందుబాటులో ఉన్న 3 వేల మునగ మొక్కలను ప్రతి గ్రామంలో ఇంటి ఆవరణలో నాటుకునేందుకు ప్రజలకు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. హార్టికల్చర్ జిల్లా మేనేజర్ నందకిషోర్, ఆలూరు ఏపీడీ పద్మావతి, సీఎల్ఆర్‌సీ కోర్స్ డైరెక్టర్ సురేష్‌బాబు, ఏపీఓలు, టీఏలు, ఈసీలు ఉన్నారు.

- రైతులు పండ్ల తోటల సాగులో రాణించాలని డ్వామా పీడీ అమరనాథ్‌రెడ్డి సూచించారు. ఈ మేరకు గురువారం దేవనకొండలోని స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో పండ్ల తోటల పెంపకంపై రైతులకు క్లస్టర్ లెవెల్ సమావేశం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ.. పండ్లతోటల సాగు చేపట్టిన రైతులకు అందిస్తున్న రాయితీలను వివరించారు. ఏపీడీ పక్కీరప్ప, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

రైతులకు రుణాలు ఇప్పించాలి



డీఆర్‌ఓకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): ఖరీఫ్ రైతులకు సకాలంలో బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం, నాయకులు దంబోళన శ్రీనివాసరావు, గిడ్డయ్యాచారి, హేమంత్‌కుమార్ గురువారం ఆయన డీఆర్‌ఓ కె.మధుసూదన్‌రావును కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఖరీఫ్ ప్రారంభమైనందున 90 శాతం సబ్సిడీతో విత్తనాలు, ఎరువులు ఇవ్వాలని, గతేడాది పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని వారు డీఆర్‌ఓను కోరారు.